సాక్షి
చిత్తూరు
మంగళవారం । 3 । జనవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు రూ.54,000

22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,060

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో) రూ.69,000

రిటైల్ వెండి గ్రాము రూ.71

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	29	18
తిరుపతి	29	19
తిరుమల	24	15
గూడూరు	30	21
నగరి	29	19



బంగారు తిరుచ్చిపై అమ్మవారి కటాక్షం

తిరుచానూరు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారు బంగారు తిరుచ్చిపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అంతకుముందు అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు.

న్యూస్‌రీల్

చిత్తూరును ప్రగతిపథంలో నడిపిద్దాం

– కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అధికారులు



కలెక్టర్‌ను కలిసిన జేసీ వెంకటేశ్వర్, పలు శాఖల జిల్లా అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాను ప్రగతిపథంలో నడిపేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని కలెక్టర్ హరి నారాయణన్ అన్నారు. వారం రోజుల సెలవు అనంతరం కలెక్టర్ సోమవారం విధుల్లో చేరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్, డీఆర్వో రాజశేఖర్, పలు శాఖల అధికారులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందించాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల పురోగతిలో చిత్తూరు జిల్లా రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఈఓ విజయేంద్రరావు, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ తులసి పాల్గొన్నారు.

రహదారులకు అత్యంత ప్రాధాన్యత



మాట్లాడుతున్న ప్రద్యుమ్న

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం రహదారులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న అన్నారు. జిల్లాకు విచ్చేసిన ఆయన కలెక్టరేట్‌లో జాతీయ, రాష్ట్ర రహదారుల అధికారులతో, సంబంధిత ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తోడ్పడే రహదారుల ప్రాధాన్యతను గుర్తించి, పనులు చేపట్టాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పనుల పురోగతిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కలెక్టర్ హరి నారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో చిత్తూరు- తచ్చూరు రోడ్డు కోసం 45 హెక్టార్ల భూ సేకరణకు అవార్డు ఆమోదం పొందిందన్నారు. స్ట్రక్చర్లకు సంబంధించి అవార్డులు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను ఆర్అండ్‌బీ అధికారులు మూడు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. బెంగళూరు- చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకి సంబంధించి జిల్లాలో ఒకటి, మూడు ప్యాకేజీ పనులు జరుగుతున్నాయని అధికారులు ఆయనకు వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్, చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఎస్‌హెచ్‌ఏఐ పీడీ ప్రశాంత్, జిల్లా రవాణా శాఖాధికారి బసిరెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి జితేంద్రరెడ్డి పాల్గొన్నారు.

స్వర్ణ తేజం..ముక్కోటి ఉత్సవం

బంగారు ధగధగలు.. దివ్యాభరణాలు.. విభిన్న పుష్పమాలికలు.. విద్యుత్ వెలుగులు.. గజ ఘీంకారాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి స్వర్ణ రథాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్వర్ణరథోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. సిరి సంపదలకు మూలాధారమైన శ్రీదేవిని తన పక్కన కూర్చోబెట్టుకుని స్వర్ణరథంలో కదిలివచ్చే స్వామివారిని చూసి భక్తులు తరించారు. వైకుంఠ ద్వార దర్శనం కోసం తరలివచ్చిన అశేష భక్తజనం కర్పూరనీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయాధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. – తిరుమల



విశేషాలంకరణలో మలయప్పస్వామి



స్వర్ణ రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్త జనం

సంచార సంజీవని

రోడ్డు ప్రమాదాలు.. పురిటి నొప్పులు.. పాముకాటు.. ఏ అత్యవసర పరిస్థితి వచ్చినా వెంటే కుయ్..కుయ్ మంటూ మన ముంగిటకొచ్చి.. ప్రథమ చికిత్సలు అందించడమే కాకుండా సకాలంలో ఆస్పత్రులకు చేర్చి.. పునర్జన్మనిచ్చే వాహనమే 108 అంబులెన్స్. ఈ వాహనాలు ఆపదలో ఉన్నవారిని ఆదుకుని అందరి పాలిట ఆపద్బాంధవిగా.. సంచార సంజీవనిగా పేరుగాంచాయి. వీటి సేవలపై ప్రత్యేక కథనం.

- అత్యవసర పరిస్థితుల్లో ప్రాణం నిలుపుతున్న అంబులెన్స్‌లు
- ఆపద సమయాల్లో 108 విశిష్ట సేవలు
- ఉమ్మడి జిల్లాలో 75 వాహనాలు రయ్‌రయ్

108లోనే మగబిడ్డ ప్రసవం



ఎస్‌ఆర్ పురం మండలంలోని మెట్ట దళితవాడకు చెందిన రాజేష్ భార్య గౌతమి (28)కి గత ఆదివారం పురిటి నొప్పులొచ్చాయి. ఆమెను 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళుతుండగా నొప్పులు అధికమయ్యాయి. మార్గం మధ్యలోనే ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను క్షేమంగా ఆస్పత్రికి తరలించారు. వాహన సిబ్బందికి వారు కృతజ్ఞతలు చెప్పారు.

ప్రసవం చేసిన 108 సిబ్బంది



చౌడేపల్లె మండలం గజ్జలవారిపల్లికు చెందిన హేమ ప్రణతికి పురిటి నొప్పులు రావడంతో 108కి ఫోన్ చేశారు. 10 నిమిషాల వ్యవధిలో ఆ వాహన సిబ్బంది గర్భిణితోపాటు కుటుంబ సభ్యులను తీసుకుని మదనపల్లె ఏరియా ఆస్పత్రికి బయలుదేరారు. మార్గం మధ్యలో బోయకొండ వద్దకు వెళ్లగానే పురిటినొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది ఆమెకు ప్రసవం చేశారు. హేమప్రణతి మగబిడ్డకు జన్మనిచ్చింది.

సాక్షి,చిత్తూరు: ప్రమాద సమయాల్లో బాధితులను సకాలంలో ఆస్పత్రులకు చేర్చి, పునర్జన్మనిచ్చి, అపర సంజీవినిగా నిలిచింది 108 అంబులెన్స్. ఇక గర్భిణులకు ప్రసవం చేసి, పండంటి బిడ్డలకు ప్రాణం పోసిన కల్పతరువుగా ఈ వాహనాలు నిలిచాయి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా 108 అంబులెన్స్‌లు పురుడుపోసుకున్నాయి. నేడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో మరింత మంది బాధితులకు ఆపన్నహస్తం అందిస్తున్నాయి. ఈ వాహనాల సేవలు మరింత విస్తృతం కానున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 75 అంబులెన్స్‌లు

చిత్తూరు ఉమ్మడి జిల్లాలో మొత్తం 75 వరకు 108 అంబులెన్స్‌లున్నాయి. అన్ని నియోజవర్గ కేంద్రాలతోపాటు అన్ని మండల కేంద్రాల్లోనూ 108 వాహనాలున్నాయి.

ఎందరికో పునర్జన్మ

108 వాహనాలు ఆపదలో ఉన్న ఎందరినో సకాలంలో ఆస్పత్రులకు తరలించి, వారికి పునర్జన్మను ప్రసాధించాయి. ప్రస్తుతం మండలానికి ఒక అంబులెన్స్ కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో ఆ వాహనాలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ మరింత మెరుగైన ఫలితాలను ఇస్తున్నాయి. ఏడాది కాలంలో మొత్తం 1,13,025 లక్షల మందికి 108 వాహనాలు సేవలందించాయి. ఇందులో 19,323 వేల మందికి పైగా గర్భిణులకు, మరో 11,236 వేల మందికి పైగా ప్రమాద బాధితులకు ఆపన్నహస్తం అందించాయి.

124 మందికి పురుడు పోశాయి

చిత్తూరు ఉమ్మడి జిల్లాలో 108 సిబ్బంది ఈ ఏడాది మొత్తం 124 మంది గర్భిణులకు పురుడు పోశాయి. పురిటినొప్పులతో బాధ పడే గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లే సమయంలో నొప్పులు ఎక్కువైతే అంబులెన్స్‌లోనే పురుడుపోసిన ఘటనలున్నాయి.

ఫోన్ చేసిన 20 నిమిషాల్లోనే...

గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్ చేసిన 20 నిమిషాల్లోపు 108 అంబులెన్స్‌లు చేరుకోవాలనే నిబంధన ఉంది. అయితే ఆయా ప్రాంతాల్లో 18 నుంచి 19 నిమిషాల్లోనే అంబులెన్స్‌లు చేరుకుంటున్నాయి. ఇక పట్టణ ప్రాంతాల్లో 15 నిమిషాల్లోపు చేరుకోవాలనే నిబంధన ఉంది. ట్రాఫిక్ తదితర సమస్యల కారణంగా 15 నుంచి 18 నిమిషాల సమయం పడుతోందని నివేదిక ద్వారా తెలుస్తోంది. ఈ వాహనాల్లో అత్యధికంగా 19 శాతం వరకు ఎమర్జెన్సీ కేసుల్లో గర్భిణులను ప్రసవం కోసం ఆస్పత్రులకు తరలిస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

ఎక్కువ శాతం ప్రాణాపాయ కేసులే..

108కు వచ్చే ఫోన్‌కాల్స్ అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవే ఎక్కువగా ఉంటున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. వైద్యారోగ్యశాఖ నివేదిక ప్రకారం గర్భిణులు 19 శాతం, కిడ్నీ డయాలసిస్ 16 శాతం, ఇతర కేసులు 13, మూత్రపిండ సమస్యలు 9, శ్వాస సంబంధిత కేసులు 8, ప్రసూతి సంరక్షణ 5, వాహనేతర గాయాలు 5, పొత్తి కడుపు నొప్పి కేసులు 4, గుండె సమస్యలు 4, తీవ్ర జ్వరం 4, అపస్మారక స్థితి కేసులు 3, విష ప్రయోగం 3, పాము, కీటకాల కాటు కేసులు 2, దాడులు 2, ఫిట్స్ కేసులు 2, డయాబెటిక్ కేసులు ఒక శాతం ఉన్నాయి.



నెల	108 సేవలు పొందిన వారు	గర్భిణీల సేవలు	ప్రమాదాలు
జనవరి	8,993	1,790	1,074
ఫిబ్రవరి	7,703	1,383	854
మార్చి	9,481	1,653	1,009
ఏప్రిల్	9,740	1,828	966
మే	9,370	1,672	940
జూన్	8,961	1,481	881
జూలై	9,882	1,713	1,036
ఆగస్టు	9,487	1,487	865
సెప్టెంబర్	9,557	1,600	768
అక్టోబర్	10077	1,393	1,023
నవంబరు	9,788	1,712	887
డిసెంబర్	9,986	1,611	933
మొత్తం	11,3025	19,323	11,236

నాకు పురుడుపోసింది



మాది నింద్ర మండలం కేఆర్ పాళెం. మాకు నగరి ప్రభుత్వాస్పత్రి 20 కిలో మీటర్ల దూరం. ప్రసవాల సమయంలో గ్రామంలోని మహిళలు పడే అవస్థలు చూసేదాన్ని. వాహనం కావాలంటే నగరికి నుంచి తీసుకురావాలి. నాకు కూడా ఆ పరిస్థితి ఎక్కడ వస్తుందో అన్న భయం ఉండేది. అయితే నా అదృష్టం ప్రభుత్వం 108 వాహనాన్ని మళ్లీ అందుబాటులోకి తెచ్చింది. గత ఏడాది జూలై 6వ తేదీన నాకు పురిటి నొప్పులు వచ్చాయి. నా భర్త వెంకటేశులు 108కు ఫోన్ చేశారు. కొంత సమయానికే వాహనం గడపముందుకు వచ్చింది. వాహనంలో వెళుతుండగా నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది సుధాకర్, ప్రసాద్ కలసి నాకు 108లోనే పురుడు పోశారు. మగబిడ్డ పుట్టాడు. నేను, నా బిడ్డ క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నాం. – సుకన్య, కేఆర్ పాళెం, నింద్ర(నగరి)

నా భార్యాబిడ్డలను కాపాడింది



నేను మోటార్ సైకిల్ మెకానిక్. గత ఏడాది జనవరి 27న గర్భంతో ఉన్న నా భార్యకు (హసీనా)ఫిట్స్ వచ్చాయి. ఫోన్ చేసిన 10 నిమిషాల్లో 108 వాహనం ఇంటి ముందుకొచ్చింది. అందులో నా భార్యను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లా. పరిస్థితి ప్రమాదకరంగా ఉందని వైద్యులు చెప్పడంతో అందులోనే తిరుపతిలోని మెటర్నటీ ఆస్పత్రికి తీసుకెళ్లా. అక్కడ డాక్టర్లు ఫిట్స్ నయం చేశారు. 31 తేదీన నా భార్య మగ బిడ్డను ప్రసవించింది. ఇప్పుడు తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

–శౌకత్ ,బంగారు పాళెం

సురక్షితంగా ఇంటికి పంపారు..



రాత్రిపూట పురిటి నొప్పులు రావడంతో ఇంట్లో వాళ్లు 108కు ఫోన్ చేశారు. ఫోన్ చేసిన 15 నిమిషాల్లో వీధిలోకి ఆ వాహనం వచ్చింది. చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. సకాలంలో ఆస్పత్రిలో చేర్చారు. 108లోనే కొన్ని సూచనలు, సలహాలు ఇస్తూ, చికిత్స చేశారు. సేవలన్నీ బాగున్నాయి. తన బిడ్డతో సురక్షితంగా ఇంటికి చేరుకున్నాను.

–అమ్ము, చిత్తూరు మండలం

సేవలు.. పరుగులు



గతంలో 108 వాహనాల మానిటరింగ్ ఉండేది కాదు. మాన్యువల్‌లో నడిచేవి. ఈ కారణంగా సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం ఉండేది. ఇప్పుడు నిఘా ఉంది. వెహికల్ ఎక్కడ వెళుతోందో..తెలుసుకుంటున్నాం. దీంతో 108 సేవలు పరుగులు పెడుతున్నాయి. డయాలసిస్ బాధితులకు కూడా సేవలు అందిస్తున్నాం. 108 వాహనాల్లో అన్ని రకాల పరికరాలు, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. –పవన్‌కుమార్, 108 అంబులెన్స్ జిల్లా మేనేజర్

పులివెందుల తరహాలో పుంగనూరు అభివృద్ధి

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె: పులివెందుల తరహాలో పుంగనూరు నియోజకవర్గం అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని రాష్ట్ర విద్యుత్, అటవీ, గనుల శాఖా మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతితో కలిసి చౌడేపల్లెలో జరిగిన పల్లెబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలో ఎన్నో సమస్యలుండేవని, అభివృద్ధి కుంటుపడి ఉండేదన్నారు. 30 ఏళ్లుగా ఒకే కుటుంబం తండ్రి, కొడుకు అధికారంలో ఉన్నప్పటికీ ఏమి అభివృద్ధి చేశారని నిలదీశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు ఇచ్చిన స్వేచ్ఛతో పుంగనూరును అభివృద్ధి చేయగలిగానని మంత్రి పెద్దిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకున్నానని చెప్పారు. ఇప్పటికే ప్రతి గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించామని తెలిపారు. ఇంకనూ మండలంలో అవసరమైన చోట 21 ప్రదేశాల్లో సుమారు రూ.11 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలకు టెండర్లు పిలిచామన్నారు. ట్యాంకుల నుంచి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గండి కోట రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా ద్వారా పుంగనూరు ప్రాంతానికి నీరు అందించడం కోసం ప్రత్యేక ప్రాజెక్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నేతిగుట్లపల్లె, ఆవులపల్లె, ముదివేడులో మూడు ప్రాజెక్టులు నిర్మిస్తున్నామని, పనులు పూర్తి అయితే, మన ప్రాంతంలోని చెరువులకు అనుసంధానం చేసి, సాగు, తాగునీటికి ఎటువంటి కొరత లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 90 శాతం రోడ్లు, ఏర్పాటు చేశామన్నారు. గాంధీజీ చెప్పినట్లుగా సచివాలయాలను ఏర్పాటు చేసి గ్రామస్వరాజ్యం తెచ్చిన సీఎం జగన్‌కే దక్కిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్ల సహకారంతో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అవినీతికి తావులేకుండా అందిస్తున్నామన్నారు. పెన్షన్ రాకపోయినా, ఏదైనా పథకం రాకపోయినా ప్రజలే నేరుగా సచివాలయంలో అడిగే పరిస్థితి నెలకొందన్నారు.గతంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే పథకాలు వచ్చేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు.





మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (ఇన్‌సెట్) పరికిదొనలో ఆర్బీకే ప్రారంభిస్తున్న మంత్రి

రౌడీయిజమని దుష్ప్రచారం చేస్తున్నారు

రౌడీయిజమని తనతోపాటు తన కుటుంబంపై ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందని మంత్రి పెద్దిరెడ్డి మండిపడ్డారు. తాను ప్రజా నాయకుడినని, నిత్యం ప్రజల్లోనే ఉంటానని చెప్పారు. మమ్మల్ని అనవసరంగా టీడీపీ నాయకులు రెచ్చగొడితే రెచ్చిపోతామని వాళ్లు భావిస్తున్నారన్నారు. మనం ఒక వేళ రెచ్చిపోతే వాళ్లు ఊళ్లో కూడా ఉండలేరని వాళ్లకు తెలుసని హెచ్చరించారు. టీడీపీ అధికారంలోకి రావాలని ఎల్లో మీడియా ఎన్ని కుట్రలు పన్నినా, ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మరన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్‌నారాయణ, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, కోఆప్షన్ సభ్యుడు సాదిక్ బాషా, ఎంపీటీసీ సభ్యురాలు రూపారేఖ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో వైకుంఠ వైభవం



ఉత్తర ద్వారానికి పుష్పాలంకరణ



కల్యాణ వేంకటేశ్వరస్వామివారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

– తిరుపతి రూరల్

ఖాళీలు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించండి

– ఆదేశించిన రాష్ట్ర విద్యాశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీల కసరత్తులో ఖాళీలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈఓలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం రాత్రి రాష్ట్ర విద్యాశాఖ అధికారులు డీఈఓ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. ఆ ఉత్తర్వుల మేరకు.. పలుసార్లు వేకెన్సీలు పెట్టినా ఏదో ఒక పాఠశాలలో మళ్లీ తేడాలున్నాయని ప్రధానోపాధ్యాయులు వెల్లడిస్తున్నారన్నారని పేర్కొన్నారు. చివరగా ఒకసారి వేకెన్సీలు పరిశీలించి, తేడాలుంటే వెంటనే తెలియజేయాలన్నారు. ఆ తర్వాత మార్పులకు అవకాశం ఉండదన్నారు. క్లియర్ వేకెన్సీలను తప్పనిసరిగా చూపించాలని పేర్కొన్నారు. రీ అపోర్షన్ కసరత్తులో పాఠశాలకు రేషనలైజేషన్ కారణంగా వచ్చిన ఖాళీని చూపించాలన్నారు. పోస్ట్ అప్‌గ్రేడ్, ఎస్జీటీ పోస్టు అప్‌గ్రేడ్ ఖాళీలు, లాంగ్‌స్టాండింగ్ ఖాళీలు, అక్టోబర్ 2021లో ఉద్యోగోన్నతులపై వచ్చిన, ఉద్యోగోన్నతులు కోరుకున్న ఖాళీలు తప్పక చూపించాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు. పాఠశాల నుంచి పోతున్న సర్‌ప్లస్ ఖాళీలు చూపకూడదన్నారు. చివరగా జీతాల బిల్లులతో పోస్టులను సరిచూసుకుని ఖాళీలను నిర్ధారించి ఆమోదించాలన్నారు. ఏవైనా తప్పులున్నట్‌లతై జిల్లా విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు



నవీన్ (ఫైల్)

కుప్పంరూరల్: ఈత సరదా ఓ యువకుని ప్రాణాన్ని బలితీసుకుంది. బెంగళూరు నగరం కావేరి నగర్‌కు చెందిన యువకుడు కొత్త సంవత్సరం వేడుకలకు వచ్చి మద్యం మత్తులో ఈత కెళ్లి గల్లంతైన సంఘటన కుప్పం మండలం, యానాదిపల్లె వద్ద ఆది వారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బెంగళూరు నగరం కావేరినగర్‌కు చెందిన నవీన్ (27) తన మిత్రులతో కలిసి నూతన సంవత్సర వేడుకలకు కుప్పం వచ్చా డు. ఆదివారం మద్యం సేవించి, సరదాగా ఈత కోసం యానాదిపల్లె వద్ద ఉన్న క్వారీ గుంత లోకి వెళ్లారు. అక్కడ ఈత కొడుతూ నవీన్ క్వారీ గుంతల్లోన్ని నీటిలోకి జారుకున్నాడు. స్నేహితులు చూస్తుండగానే మృత్యువు కబళించింది. నవీన్ మృతదేహం కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోయింది. సోమవారం నుంచి అగ్నిమాపక సిబ్బంది నవీన్ మృతదేహం కోసం గాలింపు చేపడుతున్నారు.

మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నేతలు



మడుకూరులో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ ప్రచార కార్యదర్శితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గోసలకురపల్లెలో..

- ఐదు గ్రామాల్లో 120 కుటుంబాల చేరిక
- కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్న పలువురు టీడీపీ నాయకులు సోమవారం పల్లెబాట కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువా వేసి మంత్రి సాదర స్వాగతం పలికారు. ఐదు గ్రామాల్లో 120 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో నుంజార్లపల్లెకు చెందిన రాజన్న, రామచంద్ర, భాస్కర్‌తోపాటు వారి అనుచరులు ఉన్నారు. అలాగే సామిరెడ్డిపల్లెలో వెంకటప్ప, భాస్కర్, శంకర అతని అనుచరులు పార్టీలో చేరారు. మడుకూరుకు చెందిన టీడీపీ మండల ప్రచార కార్యదర్శి వెంకటరమణా రెడ్డి అతని అనుచరులు, నూనెముద్దనపల్లెలో మోహన్, సుబ్రమణ్యంతోపాటు అతని అనుచరులు ఉన్నారు. గోసలకురపల్లెలో సీఆర్ మణి, సుధాకర్, వి.రాజా, శేషాద్రి, అమర, లక్ష్మీనారాయణ, నగేష్, గంగాధర్‌తోపాటు మరో 50 మంది పార్టీలో చేరారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి, వైఎస్సార్‌సీలో చేరినట్లు తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి చెంత పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు జింకా వెంకటాచలపతి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తిపాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయండి

- సమీక్షలో ఎన్నికల అబ్జర్వర్ ప్రద్యుమ్న



మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్ ప్రద్యుమ్న

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 5వ తేదీ నాటికి తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ప్రత్యేక ఓటర్ల జాబితా ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ ప్రద్యుమ్న ఆదేశించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన ప్రత్యేక ఓటర్ల జాబితా తుది జాబితాను విడుదల చేయాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా–2023ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎటువంటి తప్పులు లేని ఓటర్ల జాబితాను ఈనెల 5న ప్రచురించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితాకు ఆధార్ అనుసంధానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గాల వారీగా జెండర్ రేషియోను పరిశీలించారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను 90శాతం పూర్తి చేశామని, ఎమ్మెల్సీ ఫైనల్ ఎలెక్టర్స్ సంబంధించి చిత్తూరు జిల్లాలో గ్రాడ్యుయేట్స్ 54,287, టీచర్లు 3,547 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మేఘ స్వరూప్, డీఆర్వో రాజశేఖర్, ఆర్డీఓలు రేణుక, శివయ్య, సృజన, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు



గాయ పడిన రోహిత

రొంపిచెర్ల: గుర్తు తెలియని కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయ పడిన సంఘటన రొంపిచెర్ల సమీపంలోని జోమ్ముచెరువు మలుపు వద్ద జరిగింది. బాధితుల కథనం మేరకు.. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఫజులుపేటకు చెందిన ఎం.రఘునాథరెడ్డి (45), భార్య నిర్మల(35), కుమార్తె రోహిత (8) జనవరి ఒకటో తేదీ సదుం అయ్యప్పగుడికి వెళ్లి, తిరిగి ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ఇంటికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా జోమ్ముచెరువు మలుపు వద్ద రొంపిచెర్ల నుంచి వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ఉన్న రోహితకు తీవ్ర గాయాలు కాగా రఘునాథరెడ్డి, నిర్మలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు పీలేరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ విషయమై బాధితులు రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

గుడుపల్లె: చేపల వేట కోసం వెళ్లి గోపన్న చెరువులో మునికృష్ణ(34) అనే వ్యక్తి మృతి చెందాడు, గుడుపల్లె ఎస్‌ఐ రామాంజనేయులు కథనం మేరకు.. మండంలంలోని బిసానత్తం గ్రామానికి చెందిన మునికృష్ణ ఆదివారం రాత్రి తన స్నేహితులతో కలసి గ్రామ సమీపంలోని గోపన్న చెరువుకు వల తీసుకుని చేపల వేటకు వెళ్లాడు. చెరువులో వల వేస్తూ వలలో చిక్కుకుని మునిగిపోయాడు. అతనితో పాటు వెళ్లిన స్నేహితులు గుట్టు చప్పుడు కాకుండా ఇంటికి వచ్చేశారు. సోమవారం ఉదయం మునికృష్ణ భార్య మునిలక్ష్మి భర్త కోసం వెదికిన దొరకలేదు. దీంతో చెరువు పక్కన బట్టలు ఉండడంతో అనుమానం వచ్చింది. వెంటనే గుడుపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి, పరిశీలించి మునికృష్ణ స్నేహితులను విచారించగా వల వేసి చిక్కుకుని చెరువులో మృతి చెందాడని చెప్పారు. దీంతో రాత్రి సమయం కావడంతో మంగళవారం చెరువు నుంచి మునికృష్ణ శవాన్ని వెలికి తీస్తామన్నారు.

అర్జీపై కలెక్టర్ సీల్..సంతకం

స్పందనకు 174 అర్జీలు



అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హరి నారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలు అందజేస్తున్న వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అర్జీపై కలెక్టరే స్వయంగా తన సీల్ వేసి, సంతకం చేసి కింది స్థాయి అధికారులకు పంపుతున్నారు. పలు సమస్యలను అప్పటికప్పుడే క్షేత్రస్థాయి అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి కలెక్టర్ హరి నారాయణన్, జేసీ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్, డీఆర్వో రాజశేఖర్ అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావిస్తున్న స్పందన కార్యక్రమంలో నమోదయ్యే అర్జీలను అధికారులు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. పలు శాఖల జిల్లా అధికారులు ప్రభాకర్‌రెడ్డి, విజయేంద్రరావు, తులసి, తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 174 అర్జీలు

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మొత్తం 174 అర్జీలు రాగా, ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 79, సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డులు 5, పంచాయత్ రాజ్ 2, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్‌లు 2, పోలీసు శాఖకు 2, ఇతరులు 9, అన్ రిజిస్టెడ్ పిటిషన్లు ఆన్‌లైన్‌లో నమోదు కానివి (రేషన్ కార్డులు, పింఛన్లు) ఇతర అర్జీలు 75 వచ్చాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

అస్వస్థతకు గురైన వృద్ధురాలు

భూ సమస్యను విన్నవించుకునేందుకు స్పందన కార్యక్రమానికి విచ్చేసిన బంగారుపాళెం మండలం దిగువ బందార్లపల్లెకు చెందిన వృద్ధురాలు శ్యామల అస్వస్థతకు గురయ్యారు. అర్జీ ఇచ్చేందుకు కుర్చీపై నిరీక్షిస్తున్న ఆమె..ఆకస్మాత్తుగా కింద పడిపోయారు. వెంటనే కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్, కలెక్టరేట్‌లో ఉండే వైద్యులు ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కాసేపు అయ్యాక స్పృహలోకి వచ్చిన ఆమె తన భూ సమస్యను అధికారులకు విన్నవించారు. 40 ఏళ్లుగా తన అనుభవంలోని భూమికి పట్టా ఇప్పించాలని కోరారు. బాధితురాలి సమస్యపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

స్పందన అర్జీల పరిశీలన వేగవంతం చేయాలి



స్పందనలో పాల్గొన్న ఎస్పీ రిషాంత్ రెడ్డి

చిత్తూరు అర్బన్: స్పందన అర్జీలపై పరిశీలన వేగవంతం చేసి, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 15 ఫిర్యాదులు రాగా..చీటింగ్ 2, వేధింపులు 4, ఆస్తి తగాదాలు 7, పోలీసు సర్వీసెస్ 2 చొప్పున్న అందాయి. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ జీ నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ మురళి, ఆర్ఐ మధు పాల్గొన్నారు.

కన్నీటి సుడిగుండం

- తలకోన జలపాతం వద్ద యువకుడి మృతి
- స్నేహితులతో న్యూఇయర్ వేడుకలకు వచ్చి గల్లంతు
- మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు



జలపాతంలో వెంకటమోహన్ మృతదేహాన్ని వెలికి తీస్తున్న పోలీసులు



వెంకటమోహన్ (ఫైల్)

ఎర్రావారిపాళెం: నూతన సంవత్సర వేడుకలకని తలకోన జలపాతం వద్ద స్నేహితులతో కలిసి వెళ్లిన ఓ యువకుడు గుండంలో చిక్కుకుని మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు.. స్విమ్స్‌లో బీఎస్సీ నర్సింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న జగదీష్, అనీల్‌కుమార్, వెంకటమోహన్ ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా తలకోనకు వెళ్లారు. అక్కడ జలపాతం వద్ద ఉన్న గుండంలో స్నానాలు ఆచరిస్తూ సందడి చేశారు. ఇంతలో వెంకటమోహన్(20) కనిపించకుండా పోయాడు. వెంటనే అతని కోసం గాలించినా ప్రయోజనం లేకపోయింది. అనంతరం స్నేహితులు తలకోన అవుట్‌పోస్టు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు మైక్ అనౌన్స్‌మెంట్ ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆదివారం రాత్రి మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం కర్నూలు జిల్లా, కల్లూరు మండలం, మాధవనగర్‌లోని వెంకటమోహన్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు ఎర్రావారిపాళెంకు చేరుకొని తలకోన ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం గుండంలో ఇరుక్కుపోయిన వెంకటమోహన్ మృతదేహాన్ని వెలికితీవారు. ఉన్నత చదువుల కోసం వచ్చిన బిడ్డ విగత జీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు దర్యాప్తులో ఉంది.

సెక్టోరల్ అధికారులు బాధ్యతగా పనిచేయండి

- డీఈఓ విజయేంద్రరావు



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : సమగ్రశిక్ష శాఖ సెక్టోరల్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. సోమవారం డీఈఓ కార్యాలయంలో సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏదో పాఠశాల తనిఖీకి వెళ్లామా.. వచ్చామా అని కాకుండా విద్యార్థుల సామర్థ్యాలను తప్పనిసరిగా పరీక్షించాలన్నారు. ఉపాధ్యాయుల పాఠాల బోధనను పరిశీలించి, సూచనలు ఇవ్వాలని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనల నివేదికలను తప్పనిసరిగా డీఈఓ, ఏపీసీలకు అందజేయాలని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సెక్టోరల్ అధికారులు ప్రభాకర్‌వర్మ, లావణ్య, ఉదయలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



నంజమ్మ మృతదేహం

చౌడేపల్లె: శతాధిక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని ఆమినిగుంటలో సోమవారం చోటుచేసుకొంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పూల నంజమ్మ(105) వృద్ధాప్యంలోనూ తన పనులను తానే చేసుకుంటూ చలాకీగా అందరితో కలివిడిగా ఉండేది. ఈ క్రమంలో ఉదయం ఇంటి ముందు జారిపడి అలాగే ప్రాణాలు విడిచింది. మృతురాలి భర్త అగిస్టిప్ప పుంగనూరు మండలం నెక్కుంది సమీపంలో జమిందారుల పాలనలో నిర్మించిన అగస్టీశ్వరస్వామి ఆలయానికి పూలు సరఫరా చేసే వారు. వారి మధ్య అనుబంధంతో ఆమినిగుంట వద్ద జమిందారులకు చెందిన స్థలాన్ని అగిస్టిప్పకు ఇచ్చారు. ఈ స్థలాన్ని నంజమ్మ సుమారు 40 మందికి పైగా గృహ నిర్మాణాల కోసం ఉచితంగా ఇచ్చారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి ఎనిమిది మంది సంతానం. వీరిలో ఐదుగురు కుమారులు కాగా ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరందరూ ఆమినిగుంటలోనే నివశిస్తున్నారు. ఈమె నాలుగోతరం వారసులను చూసింది. మొత్తం కుటుంబ సభ్యులు 70 ఉన్నారని కుటుంబసభ్యులు తెలిపారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

పూతలపట్టు ఎంఈఓ ఇంట్లో చోరీ



ఎంఈఓ ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

పూతలపట్టు: ఎంఈఓ కృష్ణారెడ్డి ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. ఈ విషయమై బాధితుడు పూతలపట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూతలపట్టు ఎస్‌ఐ హరి ప్రసాద్ కథనం మేరకు.. మండలంలోని ముత్తిరేవుల గ్రామంలో ఎంఈఓ కృష్ణారెడ్డి నివాసం ఉన్నారు. కృష్ణారెడ్డి ఎంఈఓ కాగా ఆయన భార్య కల్పన పి.కొత్తకోట జెడ్పీ హైస్కూలులో సోషియల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వారిద్దరు ఉద్యోగులే కావడంతో సోమవారం రోజులాగే విధులకు వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన దొంగలు ఇంటి తలుపులను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న దాదాపు 20 తులాల బంగారం, కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు ఎంఈఓ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి పరిశీలించి విచారించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయానికి సోమవారం పలువురు ప్రముఖులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప



ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ భరత్, డీఐజీ రవి ప్రకాష్, చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి

వైభవం.. వైకుంఠ ఏకాదశి



ఊరేగుతున్న వరదరాజుల స్వామి (ఇన్‌సెట్) ఉత్తర ద్వారంలో దర్శనానికి వెళుతున్న భక్తులు

- భక్తులకు ఉత్తర ద్వారం దర్శనం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి అనుబంధ ఆలయం అయిన వరదరాజులస్వామివారి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువజామున ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. స్వామివారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు ఉత్తర ద్వారం దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలో అలంకార మండపంలో శ్రీదేవి, పెరుందేవి సమేత వరదరాజులస్వామివారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి సుగంధ భరిత పుష్పాలతో అలంకరించి, పూజలు చేసి ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ

వైకుంఠ ఏకాదశి సందర్భంగా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుంచి పట్టు వస్త్రాలను ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఆలయాధికారులు ఊరేగింపుగా తీసుకెళ్లి, వరదరాజుల స్వామివారికి సమర్పించారు. అనంతరం ఆ పట్టు వస్త్రాలను ఆలయ అర్చక వేదపండితులు స్వామివారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాన్ని సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు.

• చల్లంగుండు బిడ్డా



ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్న పెన్షన్‌దారులు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వృద్ధులు

నగరి: 'ఇచ్చిన మాటకు కట్టుబడ్డావు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ఏడాదీ పింఛన్ సొమ్ము పెంచుతూ ఆదుకుంటున్నావు. నీ మేలు మరువలేం .. చల్లంగుండాలి బిడ్డా..!' అంటూ లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దీవించారు. సోమవారం నగరి మండలం, ముడిపల్లె గ్రామంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభిమానం చాటుకున్నారు. సర్పంచ్ ప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.